


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2013

సంపుటి : 19 (216) సంచిక : 1




## భారతదేశమే 'ప్రపంచ విశ్వభారతి' కావాలన్న రవీంద్ర కవీంద్రుని కలలు కల్ల గాకూడదు!!

**- సహాయ నిరాకరణము, సమ్మెలూ, బంద్‌లూ, అసమర్థులు, విద్రోహుల చేతుల్లోబడి సంపద విధ్వంసం గాకూడదు! -**

విశ్వకవి రవీంద్రుడు మాతృభాషాభివృద్ధికే గాకుండా, దేశీయమైన కళలు, వృత్తులు, సంస్కృతి సాంప్రదాయములనూ, శాంతియుత జీవితమునూ ప్రజల్లో గుర్తింపు తెచ్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసారు.

తల్లిపాలు త్రాగిన బిడ్డ ఏవిధంగా ఆరోగ్యంగా పెరుగుతాడో, మాతృభాషా అభ్యాసనం చేసిన విద్యార్థి కూడా ఎంతో ఆరోగ్యంగానూ, మానసికంగా, శారీరక పరంగా, విజ్ఞానపరంగా, వివేచన, విమల మనఃస్థితుడుగా బలిష్ఠుడు అవుతాడని బెంగాలీ రాష్ట్రంలో బెంగాలీ భాషనే బోధనా భాషగా చేయడానికి కారకుడయ్యారు.

గురుకులాశ్రమంలా, ఏడెకరాల విస్తీర్ణంగల ఆ ఆశ్రమానికి 'బ్రహ్మచర్యాశ్రమం' అని పేరుపెట్టి, కేంద్రభాగంలో 'శాంతినికేతనం', ఉత్తరాన ఆలయం, నైఋతి భాగంలో మూడు గదుల భవనం శాస్త్ర పద్ధతిలో నిర్మించారు. నైఋతిలో ఉన్న మూడుగదుల భవనంలో తన వద్ద ఉన్న పుస్తకాలనూ, వైజ్ఞానిక శాస్త్ర పరికరాలనూ ఉంచారు. విజ్ఞానకరమగు విద్యను జీవితంలో అంతర్భాగం చేయాలన్నదే రవీంద్రుని లక్ష్యం. ఆశ్రమవాసులైన పిల్లలకు ప్రకృతితో ఆత్మీయ సంబంధం ఏర్పరచాలన్నది ఆయన ముఖ్యోద్దేశం. విద్యార్థులకీ – ఉపాధ్యాయులకీమధ్య విజ్ఞానార్జన సంబంధమే గాకుండా ఆత్మీయమైన సన్నిహితత్వం ఉండాలనీ, తోటిమానవులతో, ప్రకృతీ పరిసరాలతో సన్నిహితత్వం కలిగి, ఋతువులరీత్యా వచ్చే పర్వదినాలను తోటివారితో సఖ్యంగా జరుపుకుంటూ, అతిథుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ, అతిథి మర్యాదలను పాటించాలని సూచిస్తూ, సకాలంలో పనులు నిర్వర్తించడం, చేసే పనుల్లో స్వేచ్ఛనివ్వడం, మానవులంతా ఒకే కుటుంబమనే విశ్వభావనను చిరు ప్రాయంనుంచే వారిలో చిగురింపచేయడం, రవీంద్ర కవీంద్రుని ఆశయంగా పాటించబడింది. విశ్వంలోనే ఏకైక విశ్వభారతిగా గణుతింపబడింది. ఇందుకై 'పేరీ' లో సముద్రతీరాన తమ ఇంటిని విక్రయించారు.

పిల్లలను పసివారిగా భావించి, మూసపోసిన అదే ధోరణిలో బోధిస్తే మానస వికాశం, బుద్ధి పరిణత, క్రమశిక్షణ కలుగదని, వారిలోగల అనంతశక్తి వక్రీకరణగాకుండా ముందే నీతివిజ్ఞత, కలిసికట్టుభావం నేర్పాలన్నది రవీంద్ర మహాశయుని ఆశయం. నిజానికి 'శాంతినికేతన్' వంటి విద్యాశ్రమం నెలకొల్పడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతని గుర్తించాలి. (ఈ విషయంలో భగవాన్ సత్యసాయి కృషి చేసారు.) రవీంద్రులు తన కాలంలోనే విశ్వభారతిలో విద్యాభవనం, కళాభవనం, సంగీత భవనం, శిక్షణాభవనం, శ్రీనికేతనం, శిల్పభవనం, హిందీభవనం నెలకొల్పారు. 1921 డిసెంబరులో విశ్వకవి ఆ భవనములను, నోబుల్ బహుమతి ద్వారా వచ్చిన ఆదాయమును, తన సర్వఆస్తులను తాను సేకరించిన గ్రంధాలను దేశపౌరులకే అప్పగించారు.

ఆయనలో స్వాభిమానం, దేశాభిమానం ఎక్కువ. జలియన్‌వాలాబాగ్‌లో బ్రిటీష్‌వారు భారతీయులపై జరిపిన దారుణ హింసాకాండను నిరసిస్తూ, తనకు బ్రిటిష్ ప్రభుత్వం యిచ్చిన 'సర్' గౌరవ బిరుదును తిరిగియిచ్చేసారు.

రవీంద్రులంటే మహాత్మాగాంధీకి ఎంతో గౌరవం. రవీంద్రుని 'గురూజీ' అని పిలిచారు. 1921సం॥ములో శాంతియుతంగా సహాయనిరాకరణోద్యమం తలపెట్టాలంటే రవీంద్రులు ఒప్పుకోలేదు. అది అసమర్థులచేతుల్లో పడి హింసాత్మకమవుతుందనేది రవీంద్రుల భావన. చివరకు అలాగే జరిగింది. బీహార్‌లో అది హింసకు దారితీసి చేరాచౌరీ పోలీసుస్టేషన్‌ను ఆవేశపరులైన ఉద్యమకర్తలు తగులపెట్టారు. దానితో గాంధీజీ ఆ ఉద్యమాన్ని విరమింపజేసి, రవీంద్రుని వద్దకు వెళ్ళి, నీవు దేశసంరక్షకుడవు, శాంతి ప్రియునిగా అభినందించారు. చరఖా కార్యక్రమాన్ని కూడా రవీంద్రుడంగీకరించలేదు. ఇరువురి మధ్య పరస్పర వైరుధ్యభావాలున్నా, ఒకరిపై నొకరికి గౌరవం ఉండేది. 1932 సం॥ములో 'గాంధీజీ'ని విచారించకుండా జైలుపాలు చేసినపుడు, రవీంద్ర కవీంద్రుడు తన జన్మదినోత్సవాలను రద్దు చేసుకున్నారు. ఇది దేశ ప్రియుల లక్షణం. దేశనాయకులనే అందరిలోనూ ఈ లక్షణం లోపించింది. తెలంగాణావాదుల కారణంగా, దౌర్జన్యపరులు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితినే అధోగతి పాల్జేసారు. వాళ్ళను గంగలో ముంచేస్తాను, వీళ్ళను సాగరంలో తోసేస్తాను. వాడిని బూడిద చేస్తాను. వాడు దద్దమ్మ, చవట అంటూ పరుషవాక్యాలు వాడుకోవటంలో రాజకీయం ఉంది. విద్యార్థులను కూడా రాజకీయ రంగంలోకి దింపి, వారి భావిజీవితాన్ని బుగ్గి చేస్తున్నారు.

ఒక్కరైనా రవీంద్రుని వంటి వారు, వివేకానందుల వంటి దేశభక్తిగల మహత్పురుషులు అవతరించగలరని ఆశిస్తున్నాను. దూషణ భూషణలు చేసేవారినీ ఉద్యమ కారుల్నీ బహిష్కరిస్తేనే ఈ దేశానికి భవిష్యత్తు.



బుధజన విధేయుడు

*గోటేటి శ్రీరామారావు*

**కలియుగ వైకుంఠవాసుని కరుణతో 'ప్రముఖాంధ్ర'కు**
**పంతొమ్మిది వత్సరాలు, 'ప్రముఖాంధ్ర' శ్రేయోఃకాములకు వెయ్యేళ్ళు!**
**వర్థిల్లండి! వర్థిల్లండి! ఆచంద్రతారార్కం వర్థిల్లండి!**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

*ఎవరికీ తెలుగువారి ఆత్మగౌరవం గురించీ మాట్లాడే అర్హతే లేదు! ఒకరు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. రెండవవారు రాష్ట్రం కోసం ఆత్మహుతి చేసుకున్న పొట్టి శ్రీరాములుగారు. వారికి తమ యింట ఆశ్రయం కల్పించిన మహర్షి బులుసు సాంబమూర్తిగారు.*

# తెలుగు ఆత్మగౌరవ ప్రతీక

**('అమరజీవి' అమరత్వానికి నేటికి 60 ఏళ్లు)**



ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆమరణ నిరాహారదీక్ష సాగించి ఆత్మార్పణ చేసి అమరుడైన ధీశాలి శ్రీ పొట్టి శ్రీరాములు. 1952, అక్టోబర్ 19న చెన్నై నగరంలోని మైలాపూర్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు బులుసు సాంబమూర్తి ఇంట్లో శ్రీ పొట్టి శ్రీరాములు నిరసన వ్రతం చేపట్టారు. 58 రోజుల పాటు దీక్ష కొనసాగించి రాష్ట్రావతరణకు మార్గం సుగమం చేశారు. ఆంధ్రరాష్ట్రం వాంఛిస్తూ ఆందోళన 1910లోనే ప్రారంభమైంది. న్యాపతి సుబ్బారావు, అయ్యదేవర కాళేశ్వరరావు తదితరులు గాంధీజిని కలిసి స్వరాష్ట్ర అవశ్యకతను వివరించారు. స్వాతంత్ర్యానంతరం ఈ సమస్యకు పరిష్కారం చూడగలమని గాంధీజీ హామీ ఇచ్చారు. కానీ భోగరాజు పట్టాభి సీతారామయ్య తదితర పెద్దలు 'స్వాతంత్ర్యం సాధించినా, తమిళ మంత్రులు స్వరాష్ట్ర ఏర్పాటుకు అంగీకరిస్తారా? అని అనుమానాలు వ్యక్తం చేశారు. వారి అనుమానాలు అబద్ధం కాలేదు. అందరూ ఊహించినట్లే స్వాతంత్ర్యం 1947 ఆగష్టు 15న వచ్చినా, స్వరాష్ట్ర వ్యవస్థాపనను పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ నేపథ్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు 1952, అక్టోబర్ 19న నిరసన దీక్షకు పూనుకున్నారు. దీక్ష విరమింపజేసే ప్రయత్నాలు జరిగాయి. కానీ శ్రీరాములు తలొగ్గలేదు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణంపై పార్లమెంటులో ప్రకటన చేస్తే తప్ప దీక్ష విరమించబోమని ఆయన ప్రకటన చేశారు. చివరకు ఆ దీక్షలోనే 1952, డిసెంబర్ 15వ తేదీన అసువులు బాసారు. అమరజీవి మరణవార్త దేశమంతటా దావానలంలాగా వ్యాపించింది. ప్రజలు అనేక దౌర్జన్యాలకు పూనుకున్నారు. 'పొట్టి శ్రీరాములు అమర్ రహే' అంటూ ఆంధ్ర అంతటా అలజడులు చెలరేగడంతో పార్లమెంటులో ప్రధాని నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుపై తీర్మానం 1952 డిసెంబర్ 19న ప్రవేశపెట్టారు. 1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించింది.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పడమటపల్లె గ్రామంలో గురవయ్య మహాలక్ష్మమ్మ దంపతులకు 1901, మార్చి 16న జన్మించారు. ఆయన మద్రాసులో విద్యాభ్యాసం కొనసాగించారు. రైల్వేలో నెలకు రూ. 250 జీతంతో ఉద్యోగంలో చేరారు. పిన్న వయసులోనే 29 సంవత్సరాలకే భార్యావియోగం కలిగింది. జాతీయోద్యమంలో భాగంగా గాంధీజీ పిలుపు విని 1927లో శ్రీరాములు తన ఉద్యోగానికి రాజీనామా చేసి, సబర్మతి ఆశ్రమంలో చేరారు. శ్రీ శ్రీరాములు వంటి కార్యాదీక్షా పరులు కనీసం పది మంది ఉంటే స్వరాజ్యం సంవత్సర కాలంలో సాధించవచ్చని గాంధీజీ అనేవారు. శ్రీ శ్రీరాములు నెల్లూరు జిల్లాలో హరిజనోద్ధరణ లక్ష్యంగా చిరకాలం కృషి చేశారు. ఎవరైనా దయతలచి అన్నం పెడితే తిని, లేకుంటే పస్తులతో బికారిలా మండుటెండలను లెక్కచేయక తమ సంచారం కొనసాగించేవారు. మద్రాసు రాష్ట్రంలోని తెలుగువారికి స్వరాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన శ్రీ శ్రీరాములు త్యాగశీలి. శ్రీ పొట్టి శ్రీరాములు నిమగ్నత, ధృఢదీక్షా తత్పరత యువతరం అలవరచుకోవాలి. అదే ఆయనకు మనం అందించగల నిజమైన నివాళి!

# మనవారిలో మనకు తెలియని విశేషాలెన్నో ఉన్నాయ్! వారు విశిష్ట వ్యక్తులు - విశ్వసించదగిన వ్యక్తులు!

తెలుగు భాషకూ, భారతదేశ ఆర్థిక సంపన్నతకూ విశేష కృషి చేసిన

## పాములపర్తి వెంకట నరసింహారావు




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, దేశానికి ప్రధానమంత్రిగా పనిచేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ... మన దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులను బలోపేతం చేసిన అపర చాణక్యుడు! ఆయన తీసుకున్న కొన్ని విప్లవాత్మక నిర్ణయాలు, చేసిన సంస్కరణలు మన దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేశాయి!

18 సంవత్సరాల వయసులో ఉస్మానియాలో చదువుతుండగా, నిజాంను ధిక్కరిస్తూ వందేమాతరం గీతం పాడి బహిష్కరణకు గురియై నాగపూరు విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర పట్టా పొందారు. రాజీవ్ మరణానంతరం అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని ప్రధానిని చేయాల్సి రావడంతో, రాజకీయవిరమణ చేసిన పీవీ అనుకోకుండా ప్రధాని అయ్యారు. నెహ్రూ కుటుంబం కాకుండా ఐదేళ్లపాటు ప్రధానిగా కొనసాగిన తొలి కాంగ్రెస్ నేత! 17 భాషలు తెలిసిన ఏకైక ప్రధాని పీవీ!

మహిళా సమాజ సంస్కరిణీ, ఆంధ్ర మహిళా సభ స్థాపకురాలు

## దుర్గాబాయి దేశ్‌ముఖ్

మదర్ ఆఫ్ సోషల్ వర్క్‌గా పిలువబడే దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్వాతంత్ర్యం కోసం పోరాడిన తెలుగు వీర వనిత! ఆవిడ తన జీవితాన్ని ప్రజాసేవకూ, మహిళాభ్యున్నతికీ అంకితం చేశారు. పదేళ్ల ప్రాయంలోనే స్వాతంత్ర్యోద్యమంపై అమిత ఆసక్తిని కనబరిచారు. పన్నెండేళ్ల వయసులో విరాళాలు సేక రించి మహాత్మాగాంధీకి అందజేయడమే కాకుండా, ఆయన చెప్పిన వెంటనే చేతి కున్న



బంగారు గాజులను కూడా తీసి ఇచ్చేసిన త్యాగి! వయోజనులకు చదువులకు లేకపోవడం వల్లే మూఢాచారాలు పాటిస్తున్నారని గుర్తించి, అప్పట్లోనే పెద్దల బడిని ప్రారంభించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడారు. మహిళల కోసం ప్రత్యేకంగా 'ఆంధ్ర మహిళా పత్రిక' స్థాపించి స్వయంగా సంపాదకత్వం వహించారు. ఈమె సి.డి. దేశ్‌ముఖ్‌ను వివాహమాడారు. ఈ దంపతులిరువురికీ భారత రెండో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మవిభూషణ్' బిరుదమిచ్చి కేంద్ర ప్రభుత్వం సత్కరించింది.

## శాంతినికేతన్‌లో చదువుకున్న అమర్త్యసేన్
### ఆర్థికవేత్తగా నోబెల్ గ్రహీత



భారతీయ మేధావుల్లో పేర్కొనదగిన వాడు, నోబెల్ బహుమతి స్వీకరించిన తొలి భారతీయ ఆర్థికవేత్త అమర్త్య సేన్! కరవు, మానవాభివృద్ధి సిద్ధాంతం, పేదరికం సమస్యలపై ఆయన చేసిన సంక్షేమార్థిక సిద్ధాంతం, పేదరికం సమస్యలపై ఆయన చేసిన సంక్షేమార్థిక శాస్త్ర పరిశోధనల ఫలితంగా ఆయన్ని 1998లో నోబెల్ బహుమతి వరించింది. 1999లో **భారతరత్న** బిరుదం అందుకున్నారు.

శాంతినికేతన్‌లో విద్యాభ్యాసాన్ని కొనసాగించిన శ్రీ సేన్ ఢాకాలో తర్వాత ఇండియా ఇంగ్లాండ్‌లలో ఆయన విద్య సాగింది.

కోల్‌కతా, ఢిల్లీ విశ్వవిద్యాలయాలతో పాటు ఆక్స్‌ఫర్డ్‌లోనూ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా పాఠాలు బోధించిన శ్రీ సేన్, పేదరిక స్థాయిని నిర్ధారించే 'సోషల్ చాయిస్' పద్ధతిని కనుగొన్నారు. 'గాంధీ అహింసలోనే హింసావాదం ఉంది' అన్న అమర్త్యసేన్ వివాదాస్పద వ్యాఖ్య చేసారు.

ప్రాపర్టీ అండ్ ఫెమైన్ డెవలప్‌మెంట్ యాజ్ ఫ్రీడమ్, ది అర్గ్యుమెంటేటివ్ ఇండియన్! గ్రంథాలు ఈయన ప్రముఖ రచనలు!

## ముఖ్యమంత్రి సతీమణి రాధికారెడ్డి
### ఇంటీరియర్ డిజైనర్‌గా నిపుణురాలు!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అర్థాంగి అయిన రాధికారెడ్డి చాలా తక్కువ మందికి తెలుసు. కానీ పేజ్-3 పీపుల్‌కి ఆమె మొదటినుంచీ సుపరిచితం. ఎందుకంటే, ఆమె ఒక ఇంటీరియర్ డిజైనర్‌గా రాష్ట్రంలో వలు ఆఫీసులు, వినోదకేంద్రాలు, ప్రముఖుల ఇళ్లకు ఇంటీరియర్ డిజైనింగ్ చేశారు.



కిరణ్‌కుమార్ రెడ్డి సీఎం అయ్యాక కూడా... ఒక సీఎం భార్యననుకోకుండా, ఆమె ఇప్పటికీ అదే వృత్తిని కొనసాగిస్తున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి క్యాంప్ ఆఫీసులోకి అడుగుపెట్టేముందే ఆమె దాని లోపలి అలంకరణలను స్వయంగా చేసారు. కార్యాలయం రంగులన్నీ ఆమె తన అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ఆమెకు వాస్తు శాస్త్రంలో కూడా ప్రాథమిక సూత్రాల అవగాహన ఉంది.


## నిజాం ప్రభుత్వంలో కొత్వాలుగా పనిచేసిన
## రాజబహద్దూర్ వేంకటరామారెడ్డి



ఆ రేవీ, ఆ దర్పంలో రాజసం కనిపిస్తు న్నప్పటికినీ, సర్వ సమాజ సమాన హితైషి. తెలంగాణాకు ఆయన అపారమైన సేవలు చేసారు.

నిజాం ప్రభుత్వంలో పోలీసు శాఖలోని అత్యున్నత స్థాయి 'కొత్వాల్' పదవిని 1920-34 మధ్యకాలంలో అసిధారావ్రతంగా నిర్వహించిన ధీశాలి! రాజబహద్దూర్ వేంకటరామారెడ్డి. మహబూబ్‌నగర్ జిల్లా, వనపర్తి సంస్థానంలోని రాయనిపేట గ్రామంలో 1869లో పేద కుటుంబంలో జన్మించారు వేంకట రామారెడ్డి, 1953లో తుదిశ్వాస విడిచేదాకా తెలంగాణా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. రెడ్డి హాస్టల్‌తో పాటు వివిధ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు వసతి గృహాలను ఏర్పరచారు. ఆయన ఘనత 'గోలుకొండ' పత్రిక స్థాపనతో పాటు మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాల వంటి ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పారు. మద్యపానం, అస్పృశ్యత, బాల్యవివాహాలు వంటి వాటికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలను ఆయన ముందుండి నడిపారు. సామాజిక, సాహిత్య రంగాల్లో విశేష సేవలందించారు. 'వేంకటరామారెడ్డి వ్యక్తిత్వం... సర్వసమాజ సమానహితైషయని అందరూ కొనియాడారు.

## 'పద్మశ్రీ' బిరుదం పొందిన
## తొలి హాస్య నటుడు
## రేలంగి!



రేలంగి పూర్తి పేరు రేలంగి వెంకట్రామయ్య, 1919 ఆగష్టు 9న రావులపాడులో జన్మించారు. 1935లో తీసిన 'శ్రీకృష్ణ తులాభారం' చిత్రంతో తెలుగు పరిశ్రమకు పరిచయమయ్యారు. ఆయన్ను తెరమీద చూడగానే ప్రజలు కేరింతలు కొట్టేవారు. 1970లో కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ'తో ఆయన్ను సత్కరించింది. ఈ పురస్కారం పొందిన తొలి హాస్య నటునిగా ఆయన హాస్యనటులకు ప్రత్యేకతను, చరిత్రను సృష్టించారు. ●


**SRI RAJARAJESWARI JEWELLERY**

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

*Compliments from*
**Sri Krishna Bhat**

*When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala*

**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504

**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# గురజాడ అడుగుజాడల్లో పత్రికా రచయితలు దేశమును ప్రేమించారు!




దేశభక్తిని ప్రజల్లో వ్యాప్తినొందడానికి, దేశ సంపదలను పెంపు చేసుకోడానికి, గ్రామగ్రామాన చేతి వృత్తులవారిని ప్రోత్సహిస్తూ, పాడిపంటలు వృద్ధి పొందడానికి విద్యావ్యాప్తికీ తెలుగు పత్రికా రచయితలు చెన్నపట్టణాన్ని (మద్రాసు) కేంద్రంగా చేసుకున్నారు. ప్రజల్లో స్వాతంత్ర వాంఛితం పెరగడానికి తెలుగు పత్రికారచయితలు ఆంగ్ల భాషా పత్రికలను నడుపుతూ ఆంగ్ల పత్రికా రంగంలో కూడా తెలుగువారే అగ్రగామిగా నిలిచారు. కోటంరాజు రామారావు, ఎం. చలపతిరావు, కుందూరి ఈశ్వరదత్, ఎం.చలపతిరావు, ఖాసా సుబ్బారావు ప్రభృతులు అగ్రగాములుగా నిలిచారు. ●

## ప్రకాశం గారి స్వరాజ్య దినపత్రిక

టంగుటూరి ప్రకాశం గారు 'స్వరాజ్య' అనే ఆంగ్ల దినపత్రికను మద్రాసు (చెన్నై అని ఈమధ్యకాలంలో ఆ పట్టణం పేరు మార్చేవరకూ, ఆ పట్టణాన్ని చెన్నపట్నమనీ మద్రాసు అని వ్యవహరిస్తుండేవారు. (మా మనస్సుల్లో గాఢంగా ముద్రవేసిన మద్రాసును మరో పేరుతో వ్యవహరించలేను.) జార్జిటౌన్‌లో మూకర్ నల్లముత్తు వీధిలోని ఒక ఇంటినుండి స్వరాజ్య ప్రచురింప నారంభించారు. ఆ పత్రికను స్థాపించడానికి, దానిని నిర్వహించే ఖర్చు ప్రకాశం గారు స్వయంగా భరిస్తుండేవారు. బారిస్టర్‌గా వృత్తిద్వారా సంపాదించిన ఆస్తులు, ఇళ్లు వాకిళ్లు అవసరమైనప్పుడు అమ్మేస్తుండేవాడు. స్వరాజ్య సమరంలో ఈ స్వరాజ్య పత్రికను ఓ యజ్ఞంలా త్రికరణశుద్ధితో నడుపుతుండేవాడు.

మద్రాసు మౌంట్ రోడ్ నుండి ఆనాడు ప్రచురింపబడుతున్న మరి రెండు ఆంగ్ల దినపత్రికలు 'మద్రాసు మెయిల్', 'ది హిందూ', 'మెయిల్ పత్రిక బ్రిటిష్ పాలకుల కొమ్ము కాస్తుండేవి. హిందూ పత్రిక పాలకులకు వ్యతిరిక్తంగా రాయాల్సి వచ్చినా, మితవాద ధోరణిలో చాలా జాగ్రత్తగా రాసేది ఒక్క **స్వరాజ్య** పత్రికే! గర్జిస్తూ వ్రాసే శైలి ప్రారంభమైంది ఏరోజుకా రోజు ఇవాళ స్వరాజ్య వారి 'పిడుగు' ఎవరిమీద పడనున్నదో అని పాఠకులు ఎదురుచూసేవారు. ఆరోజుల్లో ఇంగ్లీషు పత్రికలు, ఒకే ఒక తెలుగు దినపత్రిక 'ఆంధ్ర పత్రిక' సాయంత్రం ఆరు ఏడు గంటల మధ్య విడుదలయ్యేవి.

సాయంత్రంవేళ ఆఫీసుల నుండి ఇళ్లకు వెళ్లేవారు, తదితరులు మూకర్ నల్లముత్తు వీధిలోని (ఆంధ్రపత్రిక డైలీ తంబుచెట్టి వీధిలో వుండేది. రెండింటి మధ్యా ఓ రెండు మూడు ఫర్లాంగులు దూరముండేది) స్వరాజ్య ఆఫీస్ ముందు బారులుతీరి నిలుచుండేవాడు. 'క్యూ' రెండు మూడు వందల దాకా వుండేది. 'స్వరాజ్య' హాట్ హాట్‌గా కొనుక్కొని, సంపాదకీయాన్ని వీధి దీపాల మసక మసక వెలుతురులోనే చదువుకొని వెళ్లేవారు. చదువరులు స్వరాజ్య అప్పటికప్పుడే చదవడం, అదొక చోద్యంగా చెప్పుకునేవారు. కాపీలు ఎక్కడికక్కడే అయిపో తుండేవి. ప్రకాశంగారి పెట్టుబడి కూడా అలాగే అగ్నికి ఆహుతి అయినట్లు అయిపోతుండేది. ఏరోజున బ్రిటీష పాలకులు ఈ పేపర్‌కు 'సెక్యూరిటీ' కట్టించుకుంటారో ఎవరికీ తెలియదు. ప్రకాశం గారికి అసలే తెలియదు. పాలకుల అన్యాయలను చెండాడం ఒక్కటే తెలుసు. అగ్నిగుండంలోకి ఉరకడం తెలుసు. ఇంగ్లాండులోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి భారతదేశానికి తిరిగివచ్చిన సర్దార్ కె.ఎమ్.పణిక్కర్ **స్వరాజ్య**కు ఎడిటర్. జర్నలిజంలో తర్వాతికాలంలో చాలా ప్రసిద్ధులైన జి.వి. కృపానిధి, కుందూరి ఈశ్వరదత్తు, యమ్.చలపతిరావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, ఖాసా సుబ్బారావు, కోటంరాజు రామారావు (మరికొందరు కూడా) సంపాదకవర్గంలో ఉండేవారు. వీరెవ్వరికీ టైమ్ ప్రకారం జీతాలందేవి కాదు; ఒక్కోసారి ఆఫీసుకు భోజనం కారియర్లు తెప్పించి అందరికీ భోజనం పెట్టించే ఏర్పాటు జరుగుతుండేది. దూరాన ఉన్న నివాసం నుండి ఖాసా సముద్రపు బీచ్ వొడ్డు గుండా, కాలినడకనే ఆఫీసుకు నడిచి వచ్చేవారు.



## దేశభక్తి ప్రేరణా గీతంలోని పసందైన పదాలు

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్
మంచిగతమున కొంచెమేనోయ్
మందగించక ముందు అడుగేయేయ్
వ్యర్థకలహం పెంచబోకోయ్
పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపి కెక్కడ సుఖం కలదోయి?
సొంతలాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్!
అన్నదముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలనోయ్!
మతము వేరైతేను యేమోయ్
మనసు లొక్కటై మనుషులుంటే
జాతి యన్నది లేక పెరిగీ
లోకమున రాణించునోయ్!
దేశమంటే మట్టి కాదోయ్!
దేశమంటే మనుష్యులోయ్!



**ఆనాడు దేశాన్ని ప్రేమించే తెలుగు పత్రికా రచయితల కేంద్రస్థానం చెన్నపట్నం**





# విష్ణు భగవానుని కారణంగా జలరాశి నుంచి పైకి ఎగసి వచ్చిన భూమి భారతదేశమే!

## - ఇతర ఖండాలు కనుగుడ్డు విప్పలేదు! అపార జలంలోనే నిక్షిప్తమై ఉన్నాయ్!

## - భాగవత గ్రంథం ఈ సృష్టి క్రమాన్ని వివరించింది! -

వైవశ్వత మనువు యొక్క సంతతివాడే ప్రస్తుత మానవుడు. మేరు దండమైన ఈ భూమి ఆవిర్భవించిన నాటి నుండీ భూమి ఇరుసుకు నాలుగు పర్యాయములు ప్రళయములు వచ్చినవి. ఎప్పటికప్పుడు ఇతర భూఖండములు సముద్రములో మునుగుటయు, క్రొత్త భూఖండములు వెలువడుటయూ జరుగుతూ వచ్చినది. భరతఖండమూ ఒక్కటే ఆనాటి నుంచీ ఈనాటి వరకూ మునిగియుండలేదు. ఈ ఖండమూ చుట్టూ జలమే ఉండడం వలన ఈ ఖండానికి జంబుద్వీపమనే పేరు కల్గినది. వేదములు పుట్టడం వలన వేదభూమియనీ, మహర్షుల తపోబలంచే ఖగోళజ్ఞానం, దీర్ఘకాలిక జీవితం, శ్రవణ పూర్వకంగా విద్య నేర్పడం, నిరక్షరాశులు కూడా భక్తి జ్ఞానవంతులు కావడానికి ఆదిదేవుని ఉపదేశాలు వేదములుగా వెలిసినవి. బ్రహ్మ సృష్టికర్త కావడం, సరస్వతీదేవి అనుగ్రహంతో భరతఖండం, భరతవర్షమై ఇతరదేశాలకు విజ్ఞానకాంతులు వ్యాప్తినొందించాయ్. హిమాలయములకుత్తర భాగం నుంచీ అట్లాంటిక్ మహాసముద్రము వరకునూ నీరే నోరు తెరుచుకుని ఉన్నది.

అందుకే ప్రవరలో మేరు దిగ్బాగే జంబూద్వీపే భరతవర్షే, భరతఖండే వైవస్వ మన్వంతరమని చెప్పుకుంటాం. మనం యిప్పుడు ఐదవ ఉపజాతిలో ఉన్నాం. ఒక్కొక్క ఉపజాతి 30,000లు సంవత్సరములుంటుంది. అనగా ఇప్పటికి 150 కోట్ల సంవత్సరాల కాలంనుండీ జంబూ ద్వీపంలో జీవులున్నారనీ తెలుస్తున్నది. క్రీస్తు లెక్కల ప్రకారం 2000ల సంవత్సరములను, క్రీ.పూ. 5 వేల సంవత్సరములను లెక్కలు కట్టడం పొరపాటు. ఆ మాట కొస్తే అప్పటికి ఆఫ్రికా, అమెరికా, బ్రిటన్‌లు నీటిలోనే ఉన్నాయ్. ఖండాలు తేలడం, మునగడం జరుగుతూనే ఉంటున్నది. ఋతమూ, ధైత్యమూ ఖండముల ఉనికే తెలియడంలేదు. వాటిపై అట్లాంటిక్ సముద్రం పారుతూంది.

ప్రపంచం బట్టకట్టకమునుపే భారతదేశంలో ఋషులూ, మునుల దీర్ఘతపస్సు, నిష్ఠ, దూరదృష్టితో అనేక సత్యాలను స్ఫుటీకరించినట్టు స్పష్టపరిచారు. అక్షరాశ్యులు కానివారికి కూడా విజ్ఞానవికాసం కలిగేట్టు శ్రవ్యవిధానాన్ని ప్రవేశపెట్టినది భారతీయ ఋషులే! భారత దేశంలో ఉన్నంతమంది ఋషులూ, అవధూతలూ ఏ దేశంలోనూ లేరు. ఇప్పటికీ దృశ్యాదృశ్యంగా మహత్పురుషులు హిమాలయాల్లో ఉన్నట్టు దేశచరిత్ర చెబుతూన్నది. అయితే ఆంగ్లేయులు వచ్చిన తరువాత దేశచరిత్ర, సంస్కృతీ సాంప్రదాయాలను మార్చి చెప్పడం జరిగింది. ప్రతిదీ ఏ పాశ్యాత్య శాస్త్రజ్ఞుడో కనిపెట్టాడన్న అసత్యం సత్యంగా బ్రతుకుతూంది.

వేదాల ఆది అంత్యాల సారాన్ని అవగాహన చేసుకోవడానికి బ్రహ్మ వద్ద ఆయుః ప్రమాణాన్ని పెంపొందించుకుని కూడా భరద్వాజ మహర్షి పూర్తి వేదసారాన్ని గ్రహించలేక పోయారు. "అనంతా వై వేధాః" అన్న ఆర్యోక్తి పుట్టింది కూడా అందుకేనేమో! విమాన నిర్మాణ శాస్త్రమును భువిశాస్త్రజ్ఞులకు తెలిపిన మహర్షి భరద్వాజుల వారేనన్న సంగతి ఎందరెరుగుదురు? భరద్వాజ గోత్రీకుల మని చెప్పుకునే భారతీయుల్లో 'త్రయాఋషేయ' అనే ప్రవర సంపన్నత నెరుగరు.

వేదం నుంచే తెలుగు అక్షఋలు, తెలుగు భాష పుట్టిన దన్న విషయం చాలామందికి తెలియదు. యునెస్కో వారు అదృశ్యమయ్యే భాషల్లో తెలుగు ఉందన్నమాట అంటారు. **'అ - అం'** సంపుటిగా 56 లఘు గురు అక్షఋ సంపుటిగా, సామవేద స్వరంగా పుట్టిన తెలుగు ఎప్పటికీ వెలుగులోనే ఉంటుంది. సూర్య చంద్రులున్నంతవరకూ తెలుగువెలుగు భాసిల్లుతూనే ఉందన్నదన్నది సత్యం. జై తెలుగుతల్లీ! ●


*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**



# శివుడు మూడో కన్ను తెరిస్తే గానీ యుగాంతం కాదు! ఆయనే ఐశ్వర్య కారకుడు!




'ప్రత్యక్షేణ అనుమిత్యా వా అధవాశాస్త్ర ప్రమాణతః'

అన్న శాస్త్ర ప్రమాణత ఉన్నది.

ఏ విషయాన్నైనా చెప్పాలంటే దానికి మూడు ప్రమాణాలున్నాయంటోంది శాస్త్రం. ప్రతి + అక్షమ్ - కళ్లకి కనిపిస్తూ ఉండటం మొదటి ప్రమాణం. 'ఆ వ్యక్తికి అనారోగ్యం సోకింది - రోజురోజుకీ చిక్కిపోతూ కనిపిస్తున్నాడు. ఇది ప్రత్యక్ష ప్రమాణం.

ఇలా అన్నిటికీ ప్రత్యక్ష ప్రమాణాలని చూపించడం సాధ్యం కాదు. అప్పుడు చేయవలసింది 'అనుమాన ప్రమాణం' మాత్రమే. 'పర్వతో వహ్నిమాన్ ధూమాత్' - ఆ కన్పించే పర్వతం నుండి పొగ వస్తోందేమిటి? పొగ కనిపిస్తూ ఉంది కాబట్టి ఆ పర్వతంలో వస్తోందేమిటి? పొగ కనిపిస్తూ ఉంది. కాబట్టి ఆ పర్వతంలో అగ్ని ఉందని గ్రహించడం అనుమానం (కారణం).

ఇలా ప్రత్యక్షంగానూ పరోక్షమైన అనుమానం ద్వారానూ కూడా సాధ్యం కాని సందర్భంలో శాస్త్ర ప్రమాణాన్నే ప్రమాణంగా తీసుకోవాలంటోంది శాస్త్రం. శతమానం భవతి-ప్రాణంతో పుట్టిన ప్రాణి. ప్రాణుల ఆయువు అంటే జీవించే కాలం నూరేళ్లు అని దీనర్థం.

'ఇదేం శాస్త్రం? ఇదేం చెప్పడ'మని! వ్యాఖ్యానిస్తే శతమానం అంటే ఎంత ఆయుష్కాలమో అది దానికి నూరేళ్లు అని అర్థం. ఉదాహరణకి ఈగ ఆయుష్యం 3 రోజులు. కుక్క ఆయుష్యం 14 ఏళ్లు. ఈ ప్రకారం లెక్కిస్తే వ్యక్తి (మనిషి) ఆయుష్యం 100 నుండి 120 ఏళ్లు. 120 ఏళ్లా? అనుకోకూడదు. జ్యోతిష్యం ప్రకారం రవి దశ 6 ఏళ్లు. చంద్ర దశ 10 ఏళ్లు. ఇదే తీరులో కుజ 7, రాహు 18, గురు 16, శని 19, బుధ 17, కేతు 7 ఏళ్లు కలిపితే 100 అవుతుంది.

ఏ వ్యక్తయినా పైన చెప్పిన ఏదో ఒక దశలోని కొంత భాగం గడిచాకే పుడతాడు కాబట్టి 100-120 మధ్యకాలం వ్యక్తి ఆయుష్కాలమంది శాస్త్రం. శతాధిక వృద్ధుడు/వృద్ధురాలు అనే మాటలు మనకి వినిపిస్తుంటాయి.



కలి కృతయుగాల సంధి కాలంలో, విష్ణుయశుడనే పేరున్న విప్రునింట కల్కి అనే పేరుతో పుట్టి సర్వప్రాణుల్నీ అశ్వవాహనాన్నెక్కి తిరుగుతూ వధిస్తారని పరంధాముడే చెప్పాడు. ఇదింకా కలియుగమే. ఇప్పుడు కలియుగపు ముగింపు జరగనే జరగలేదు. 4,32,000 సంవత్సరాల చివరికే జరిగేది!

యుగాంతమైనా మీరు ప్రాణాలతో ఉండొచ్చునంటూ కొందరు భూమిలో 20 అడుగుల లోతు తవ్వి బంకరు పేర్చారు!



ఇలా సగటు ప్రాణికి ఆయుష్కాలమనేది నిర్ణయింపబడితే అనారోగ్యకర వాతావరణంలో నివాసం, ఆహార విహార నియమాలని పాటించక పోవడం... ఇలాంటి కారణాలతో ఆ ప్రాణి మృత్యువు పొందితే, యదార్థంగా మృత్యువు రావలసిన కాలం కాదు కాబట్టి 'అప మృత్యువు' అంటుంది శాస్త్రం. అపమృత్యువంటే కాలం కాని కాలంలో మృత్యువుని పొందడం. అపమృత్యువు వచ్చిన వ్యక్తిని ఉద్దేశించి చెప్పేటప్పుడు అందుకే వాడికి అప్పుడే నూరేళ్లు నిండాయంటారు. అంటే వాడికి ఉద్దేశింపబడిన నూరేళ్లు వాడు ఈ లోకం నుండి నిష్క్రమించిన కాలంతో సమానమని భావం.

## పురాణం ప్రకారం కలియుగపు ముగింపు

పురాణాల్లో కాలాన్ని నాలుగు యుగాలుగా విభజించారు. మొదటి యుగాన్ని 'కృతయుగం' అన్నారు. 'కృత' అనే పదానికి శాస్త్రం ప్రకారం '4' అని అర్థం. అన్నిటికంటే తక్కువ ఆయుష్కాలం కలిగింది కలియుగమే కాబట్టి దాని ప్రమాణ కాలానికి (4,32,000 ఏళ్లు) కృత అంటే 4 రెట్ల కాలం ఉండేది కృతయుగము. ఆ దృష్టితో చూస్తే కృతయుగ ఆయుష్కాలం 4×4,32,000 = 17,28, 000. ఆ కాల పరిమితి అవుతోందనగానే యుగం ముగిసి పోతుంది. అలాగే కాలం ముగిసిపోవడాన్ని దర్శించిన మహర్షులు ఆ ముగిసిన సాక్ష్యాన్ని పురాణాల్లో భద్రపరిచారు.

ఇక త్రేతాయుగమనేది రెండవ యుగం. 'త్రి-త' కలియుగ కాలానికి 3 రెట్లు దీని కాలం ఈ యుగం ఉంటుందని అర్థంతో దీని పేరు 'ద్వాపర'మన్నారు. కాబట్టి ద్వాపర యుగ కాలం 2×4,32,000 = 8,64,000 సంవత్సరాలు. అది కాగానే ఆ యుగం ముగిసి పోతుంది.

'యస్మిన్ కృష్ణో దివం యాతః - తస్మిన్నేవ తదాహని - ప్రతిపన్నం కలియుగమ్' అంటుంది పురాణం. ఏ రోజున శ్రీకృష్ణుడు

భూమిని విడిచి తన గోలోక స్థానానికి వెళ్ళారో ఆ రోజునే ప్రారంభమైన కాలం. 'కలియుగ'మని దానర్థం. ఈ యుగానికి పెద్ద దిక్కుగా ఉండే శ్రీకృష్ణుడు వెళ్లిపోయాక, ఈ కలియుగం దిశ శ్రీకృష్ణుడు అండగా లేని కాలమయిపోయింది. అందుచేతనే లోకంలో ఓ మాట – 'నీ దిక్కున్నచోట చెప్పుకో' అనే సామెత పుట్టిందంటారు.

ఇలా క్రమక్రమ పతనాన్ని గమనించిన శాస్త్రం. ఈ విశేషాన్ని పురాణాలకి అందిస్తే, ఆ పురాణం ఈ వివరాలని లోకానికి అందించింది.

కృతయుగం అన్ని సంవత్సరాలు ఉండటానిక్కారణం అందరూ సత్య ధర్మ పరాయణులు (మాంధాత, బలి మొదలగువారు). త్రేతాయుగం అన్నేళ్లు ఉండడానిక్కారణం అధర్మానికి కౌరవులు కొమ్ము కాసి ధర్మపరులైన పాండవుల్ని ఇరుకున పెట్టి కష్టాలపాలు చేయడం!

యుగం ఉండే ఆయుష్కాలమనేది ఆ యుగంలోని జనుల లక్షణాలు, గుణాల మీద ఆధారపడి ఉంటుంది.

భాగవతం కలియుగ జనుల లక్షణాలని చెప్తూ –

**ప్రాయేణాల్పాయుష స్సర్వే కలావస్మిన్ యుగే జనాః!**

**మందా స్సుమందమతయో మందభాగ్యా హ్యుపద్రుతాః!**

జనుల ఆయుష్యం ముత్తాత నుండి తాతకి, తాత నుండి తండ్రికి, తండ్రి నుండి కొడుక్కి తరిగిపోతూ ఉంటుంది కలియుగంలో! బుద్ధిమాంద్యం, ఎప్పుడూ ధనం లేదని అంటూండే వాపిరితనం (డబ్బున్నవాడూ లేనివాడు అదేమాట సరేసరి), దురదృష్టకర విధానాలు, ఏ పుణ్యకార్యాలకి ముందుకు మనసు రాని ధోరణి... ఉంటుంది.


ఇదంతా కలియుగ ప్రాణుల్లో స్పష్టంగా కనిపిస్తూ భాగవతం నిజమని నిరూపిస్తూన్నది.

**'అథా సౌ యుగ సంధ్యాయాం దస్యు ప్రాయేషు రాజను!**

**జనితా విష్ణుయశసో నామ్నా కల్కి ర్జగత్పతిః!**

కలి – కృతయుగాల సంధి కాలంలో, రాజులంతా దొంగల్లా రాజరికాన్ని చేస్తూ ఉన్నవేళల్లో విష్ణుయశుడనే పేరున్న విప్రునింట కల్కి అనే పేరుతో పుట్టి సర్వప్రాణుల్ని అశ్వవాహనాన్నెక్కి తిరుగుతూ వధిస్తానని పరమేశ్వరుడే చెప్పాడు కాబట్టి – ఇదింకా కలియుగమే. ఇప్పుడు కలియుగపు ముగింపు జరగనే జరగదు. 4,32,000 సంవత్సరాల చివరికే జరుగగలదు.

ఇక బ్రహ్మ పుట్టిన రోజు నుండి కాలాన్ని లెక్కించే తీరుని ప్రాచీనులు ప్రతి శుభ, అశుభ రెండు కార్యాల్లోనూ 'సంకల్పం'లో 'అద్య బ్రాహ్మణః ద్వితీయ పరార్థే శ్వేత వరాహ కల్పే కలియుగే ప్రథమ పాధే...' అని పురోహితుని చేత చదివిస్తూ, 'ఇది కలియుగంలోని ప్రథమ పాదమే సుమా! అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కలియుగ ప్రమాణంలో మొదటి పాదం (1/4 వంతు కాలం) 1,08,000 అవుతుంది! ఇక ప్రథమ కాలంలో ఇప్పటికి ఎన్ని సంవత్సరాలు జరిగాయో ఆ విషయాన్ని పంచాంగం ప్రతి సంవత్సరం మనకి చెప్తూనే ఉంటుంది. ప్రస్తుతం జరుగుతున్న ఈ నందన సంవత్సరం పద్నాలుగింటిలో 7వ దైన వైవస్వత మన్వంతరంలోని 28వ మహాయుగంలోని 4వదైన కలియుగంలోని ప్రథమ పాదం లోని 5113 సంవత్సరాలు అరవైలో 26వది. శాలివాహన శకం ప్రకారం 1934వది.



**తిరిగే గ్రహాల్లో ఒక్కో గ్రహపు వేగం తగ్గడం గాని, తాను ప్రయాణిస్తున్న కక్ష్య నుండి పొరపాటున మారడంగాని, లేదా ఒక్కోసారి పరస్పర ఘర్షణ (గుద్దుకోవడం) గాని జరుగుతూ ఉంటుంది.**

ఇంత స్పష్టంగా సంవత్సర సంవత్సరం లెక్కిస్తూ పోతూ ఏ మాత్రపు పొరపాటూ లేకుండా తప్పు రాకుండా ఋషులు దీర్ఘదర్శనం చేసి చెప్పారు. ప్రాచీనులు మనం సంప్రదాయాన్ని పాటిస్తూ, దైవారాధనంతో సుఖకర జీవితం నెరపాలని, సంస్కృతి నిలపాలనే అంతర్యం ఉందనేది నా అభిప్రాయం. దీర్ఘదర్శిగా వారన్నీ ముందుగానే చెప్పారు. ప్రళయం లాంటి వదంతులు కొట్టిపారవేయడానికే! అయితే ఈ వదంతులకే ఇంతటి ప్రాధాన్యాన్ని ఎందుకిస్తున్నామంటే మన చరిత్రని మనం తెలుసుకోని(లేని) కారణమే! పురాణాల్లో ఒకటైన భవిష్య భవిష్యోత్తర పురాణంలో కలియుగాంత లక్షణాలనిలా వివరించి చెప్పారు.

ఎవరూ ఇళ్లని వీడి ఎప్పుడూ ఇవతలకి రారు. వస్తే అమాంతంగా చేతిని, కాలిని విరిచి తినేసే ఆహార దారిద్ర్యం స్థాయితో ప్రజలు ఉంటారు. తండ్రి, కూతురు, అన్న, చెల్లెలు వంటి వావి వరసలు లేకుండా సంతానాన్ని కంటారు. వీటిని అక్షరాల్లో రాయలేనంతటి ఘోర స్థితిలో ప్రజాసంబంధాలు ఉంటాయి. యుగపు ముగింపు కావలసి వస్తూంటే ఆ లక్షణాలు సంపూర్ణంగా రాని ఈరోజుల్ని ముగింపు అనగలమా? ప్రళయం అనగలమా?

ఈ గ్రహాలు ఇలా తిరుగుతూ ఉంటాయి కాబట్టి, ఒక్కోసారి అష్ట గ్రహ కూటమి లాంటి ఉపద్రవాలు వచ్చే అవకాశముంది కాబట్టి పురాణాల్లో ఆ గ్రహాలన్నీ తమ తమ గతులు తప్పినా, అటు సూర్యుండిటు పొడ్చినన్ పొడవనీ. అంభోనిధుల్ క్రుంకనీ (సముద్రాలన్నీ ఇంకిపోయినా) వంటి మాటలు వినిపిస్తూనే ఉంటున్నాయి.

మనని రక్షించే సూర్యుడు శిక్షించదలచినప్పుడు పరాఙ్ముఖుడు అవుతాడు. ఆయన అలా పక్కకి తిరిగితే చాలు. మొదటగా సముద్రాలన్నీ ఇంకిపోతాయి. వేడిమి విజృంభిస్తుంది. వాయు చలనం ఆగిపోతుంది. భూమి కంపానికి గురవుతుంది. దేవతలందరికీ నివాసాన్నిచ్చే సూర్యుడు (ఆదిత్య మండలం మధ్యాంతర్వర్తీ నారాయణః – జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః) ఇలా మరోవైపుకి ముఖాన్ని పెడితే ఏదో ఒక ఉపద్రవం, ఎక్కడో ఒకచోట, ఏదో ఒక స్థాయిలో, ఏదో ఒక రూపంలో వస్తుంది. ●

## 2012 డిసెంబర్ 16, 29 తేదీలు భారతదేశానికి ప్రళయాన్ని తెచ్చాయి – ప్రకృతీ స్త్రీలను దేవతలుగా ఆరాధించే దేశంలో జరగరాని ద్రోహం, హత్య జరిగింది!!! - కన్నె దేవత నిర్భయ్‌ను కబళించేసింది!!! -

నాగరిక ప్రపంచం తలదించుకోవలసిన ఘోరం భారతదేశం రాజధానీ నగరంలో జరిగింది. నారీమణిని దేవతగా పూజించే దేశంలో ఘోర రాక్షసులున్నారనే సత్యాన్ని ప్రపంచానికి తెలియచేసింది. జాతిపిత గాంధీజీ ఆరోజుల్లోనే 'స్త్రీ' అర్ధరాత్రి నిర్భయంగా తిరగగలిగినప్పుడు 'మాత్రమే' స్వాతంత్ర్యం ఫలసిద్ధి నొందుతుందన్నారు. 'నిర్భయ్'పై హత్యాచారాన్ని ముందుగా ఊహించి అన్నారా? స్వాతంత్ర్య సిద్ధి దేశక్షేమాన్ని దోషసిద్ధిని సిద్ధింపచేస్తుందని అన్నారా? మొత్తానికి ప్రపంచంలో భారతదేశం తలవంచుకొనేట్టు చేసింది. ఇలాటి ఘోరాలు కోకొల్లలుగా జరుగుతున్ననూ, 'నిర్భయ్' ఘోరం బయటపడినట్లు బయటపడలేదు.

స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ రిజర్వేషన్లూ కోరేవారూ, అధికారంలో ఉన్న స్త్రీ తరం, ప్రాంతీయ ద్వేష బందలతో పుడమి సంపదలను నాశనం చేసేవారు. ప్రకృతీ, స్త్రీల సంక్షేమం, చిన్నారి ప్రాణులు (విద్యార్థులు) బలియవుతున్నారని గ్రహించడం లేదనే సత్యం నెమరేసుకోవాలి. భారతదేశంలో స్త్రీలను గౌరవించే ఆచారం కన్నెపిల్లలనుంచీ వారిని ఆరాధించే సాంప్రదాయం నశించింది.

*If you want Comfortable Stay-*
*Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114

# కోస్తాంధ్ర తీరానికి వస్తున్న పెనుముప్పు!

## ప్రజల మధ్య అనుబంధాలే కాదు

## దక్షిణ భారతానికి కవచంలా ఉన్న త్రిసాగర తీరం కూడా తరిగిపోతున్నది

## అభివృద్ధి మీ బంగారం కానూ

## అదునుచూచి వస్తున్న విధ్వంసాన్ని ఆపండి!






**పెను ప్రమాదంలో తీర ప్రాంతం**
**థర్మల్ ప్రాజెక్టుల నష్టాన్ని తక్కువగా చూపుతున్నారు**
**ప్రభుత్వం చెప్పేదొకటి జరుగుతుంది మరొకటి**
**ఉప్పగా మారిన భూగర్భ జలాలను మార్చగలమా!**
**కోస్తా ప్రాంతం దేశ ప్రజలందరి సొత్తు.**
**కార్పొరేట్లు, నాయకుల కుమ్మక్కై స్వాహా చేస్తున్నారు.**
**- ప్రబీర్ బెనర్జీ**

తూర్పుగోదావరి జిల్లాలోని మత్స్యకార గ్రామం ఉప్పాడ. 20 ఏళ్ల క్రితం వరకూ కూడా ఇక్కడ విశాలమైన సముద్ర తీరం (బీచ్) ఉండేది. కానీ ఇప్పుడదంతా తీవ్రమైన కోతకు గురైన ఫలితంగా గ్రామ భూభాగంతో పాటు నాలుగు పురాతన దేవాలయాలు, ఆటస్థలం, వందలాది ఎకరాల భూములు సముద్రంలో కలిసిపోయాయి. 2010లో మద్రాసు ఐఐటీ నిపుణులు రంగంలో దిగి ఉప్పాడ తీరానికి కి.మీ దూరం ఒంద్రుమట్టి నింపిన జియో ట్యూబులను తీరానికి కాస్త దూరంగా అడ్డుకట్టగా ఏర్పాటు చేసారు. ఇక్కడే కొంతదూరం కాంక్రీటు దిమ్మలను వేసే ప్రయోగాలు జరిగాయి. త్యాగపరుల తరం పోయి, భోగపరుల తరం వచ్చిన తరువాత ప్రకృతి పరంగానూ, స్వకృతపరంగానూ సాగరతీరం తరిగిపోతూన్నది. భారతదేశానికి మూడుప్రక్కల్లా అరేబియా సముద్రమూ, హిందూ మహాసముద్రమూ, బంగాళాఖాతమూ రక్షణ కవచంగా ఉన్నాయ్. చెట్లూచేమలూ సహజంగా ఉన్నందున, చక్కని గాలీ, వాతావరణానికి అనువైన మొక్కలూ, చెట్లూ పొదరిండ్లలా ఉన్నాయ్. అలాగే సుజల పూరితమైన నదులున్నాయ్. పచ్చదనం యిచ్చే అడవులున్నాయి. ఆ అడవులలోనే కొండలున్నాయ్. కొండలను చీల్చుకుని చెట్లూ, చేమలూ, జల్తారు తోరణాలవంటి జలపాతములున్నాయ్. 366 రోజులూ, ఔషధ మొక్కలు మీదుగా పారే ఆ జలపాతాలే శివుని శిరము నుంచీ గంగభువికి ఉరికినట్లు, స్వచ్ఛమైన ముత్యపు బిందువుల్లా నదులకు చేరుతున్నవి. అవి సజీవనదులు. సకలజీవరాశుల దాహార్తినీ, వ్యవసాయ అవసరాలను తీరుస్తున్నదన్నా, విద్యుత్పత్తి జరుగుతుందన్న – ఈ ప్రకృతీపరంగా వచ్చిన దివ్యమైన వాతావరణమే కారణము. వ్యవసాయకదేశంగా, చేతివృత్తుల దేశంగా భారతదేశం ప్రపంచదేశాలకు కూడా ఆహారం అందించింది. ఇలా మన సాగరాలు నీల మేఘ శ్యాముని కంఠహారముల్లా రత్న, వైఢూర్య, పగడ, ఆణిముత్యాల కాలవాలనిపించాయ్. నీరు కలుషితం కారాదని మన పూర్వులు నదుల్లోనూ, సాగరాల్లోనూ పడవులూ, గాలి ఓడల్లో ప్రయాణం చేసేవారు. వాటి చుక్కానికి మార్గదర్శనం కూడా మనవాళ్ళే చేసారు.

చక్కని చల్లగాలులు వీచేగ్రామాలు, గ్రామాల్లోని ప్రతీ ఇంటి వాకిట ముందూ, వెనుక, ప్రక్కలా ఫల, పుష్ప, కాయకూరల మొక్కలూ, కొబ్బరి, తాటి, పోక చెట్లను చూచి గ్రామీణులు మురిసిపోయేవారు. ఇంటి ప్రాంగణంలోనే పాకలు వేసి, పాడి పశువులను, పక్షిజాతులను పెంచే సాంప్రదాయమే కాదు, 'వాస్తు' అనే పేరిట ఇంటి ప్రధాన గుమ్మానికి తిన్నగానే అన్ని గుమ్మాలూ, అలాగే గాలీ, వెలుతురూ, ఇల్లంతా ప్రసరించేట్టు కిటికీలు ఏర్పాటు చేసారు. వీధి, దొడ్డి వసారాలలో అరుగులు కట్టేవారు. (ప్రస్తుత జనులకు అరుగులంటే తెలియదు) విశాలమైన లోగిళ్ళు, మండువాలోగిళ్ళు, ఒకటి రెండు అంతస్థులకు మించని మేడలూ కట్టుకునేవారు. ఇంటికీ ఇంటికీ మధ్య స్థలాలను విడిచి ఉంచేవారు. ఊరిలో విధిగా రామాలయం, శివాలయం, గ్రామశివార్లలో గ్రామదేవత ఆలయం, పశువులు నీరు త్రాగడానికో చెరువూ, మనుష్యులు నీరు త్రాగడానికో చెరువూ పంట పొల్లాల్లో విధిగా ఒక చెరువూ ఉండేవి. ఆ చెరువు పొలాలగుండా నీటి సరఫరా చేసే చిన్న చిన్న బోదెలూ, ఏ వస్తువు కావలసిననూ ఊరు దాటి వెలుపలకు వెళ్ళకుండా సమస్త వృత్తులవారూ ఉండేవారు. చెట్టుకిందపాఠశాల, మర్రి, రావి చెట్టు చుట్టూ విశాలంగా అరుగు నిర్మించి అక్కడే ఆ ఊరిపెద్ద గ్రామ పంచాయితీ తీర్పులు చెప్పేవాడు. అప్పటి శ్రీరామచంద్రుడు, మొన్నమొన్నటి బాపూజీ స్వయంపోషకమైన గ్రామాలూ, గ్రామ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలనుకొన్నారు. – గ్రామాలుపోయి, పట్టణాలయి, పట్టణాలన్నీ కలిసి మహానగరాలయ్యేసరికి గ్రామీణ పచ్చదనం మట్టిలో కలిసింది. గ్రామీణ వృత్తులు గంగలో కలిసాయ్.

స్వాతంత్రము సిద్ధించిన తరువాత గ్రామాలను తుంగలోకి తొక్కేసారు. మెల్లిమెల్లిగా యాంత్రిక ప్రపంచంగా దేశం మారిపోయింది. రుబ్బురోలు పోయి గ్రైండర్, తిరగలి, కత్తిపీట, కిరోసిన్‌దీపమూ ఏ ఇంట్లోనూ కనపడదు. ఆఖరికి దేవుడి వద్ద కూడా చిన్న చిన్న విద్యుద్దీప సెమ్మాలే!

నగరాల్లోనే గాకుండా, పట్టణాలూ, గ్రామాల్లో కూడా పరిశ్రమలు వచ్చేసాయ్. దేశం యాంత్రికమైంది. భగవత్ చింతన బుడుక్కుమన్నది.

దేశంమొత్తమ్మీద మన రాష్ట్ర కోస్తాతీరం 7516 కి.మీటర్లు. ఇందు ప్రధాన ప్రాంతం 5700కి.మీ. ఇలా తొమ్మిది రాష్ట్రాల్లో 2 కేంద్ర ప్రాంతాల్లో కోస్తా తీరం ఉన్నది, సాగర తీరప్రాంతంలో 73 జిల్లాలు, 77 నగరాలూ, పట్టణాలూ ఉన్నాయ్. తీరప్రాంతంలో జనసాంద్రత అధికంగా ఉన్నది. 2004 సంవత్సరం అధ్యయన ప్రకారం కోతకుగురైన సముద్ర తీరప్రాంతం 1214.75 కి.మీ.లని చెబుతున్నారు. తాజాలెఖ్ఖల ప్రకారం 1624.5 కి.మీ సముద్ర తీర ప్రాంతం కోతకు గురైందని పత్రికల భోగట్టా. మన రాష్ట్ర సాగరతీర ప్రాంతం 973.7 కి.మీ ఇందు 65.7 కి.మీ ప్రాంతం సముద్రం కోతకు గురి అయింది. కాకినాడ తీరప్రాంతం భౌగోళికంగా అడవులున్న కారణంగా సముద్రకోతను అడ్డుకుంటున్నది. ఇది సహజంగా ప్రకృతి మనకు ప్రసాదించిన రక్షణ కవచం. ఈ అడవులప్రక్కనే చాలామంది వ్యక్తులకు భూములున్నాయ్. వీటిలో 14 శాతం భూమిని చెరువులు తవ్వి రొయ్యల పెంపకం చేస్తున్నారు. అందుచేత మత్సకారులు చేసుకున్న నివాసములు, అడవుల దురాక్రమణం పెరిగి, సముద్రప్రాంతతీరం కోతకు గురవడమొకకారణమైతే, మరో ప్రక్క సముద్రం విస్తరించడం ప్రమాదకరంగా ఉన్నది. కోస్తా తీరంలోని భూమిని లోతుగా తవ్వి, జనవాసాలూ, వాణిజ్య కార్యకలాపాలు అనూహ్యంగా పెరిగాయ్. తీరమయ జలాలు మానవపరమైన కలుషితాలు సముద్రజలాల్లోకి పారిపంచేయడంతో జలాలు కలుషితమవుతున్నాయ్. అడవుల నానుకుని ఉన్న వరిపొలాలు రొయ్యల చెరువులు, అంతస్థులకంతస్థుల భవనాలు నిర్మింపబడడం, రియల్ ఎస్టేటు దారుల కారణంగా వాణిజ్య, యంత్ర పరిశ్రమలు పెరిగిపోవడంతో వాతావరణ మార్పులెన్నో జరుగుతున్నాయ్. సహజమైన గాలులను ప్రజలనుభవించలేకపోతున్నారు. అడవులు క్రమక్రమంగా నరికి వేయబడడంతో సకాలవర్షాలు తగ్గుముఖం పట్టాయి. కొన్ని పొలాలు బీడులై పశువుల మేతకు గడ్డిగాదములు లేకుండాపోతున్నాయ్. ఎండ తాకిడికి అడవుల్లో గుట్టుగా ఉంటున్న క్రూరజంతువులు, విషపురుగులు, విషనాగులూ జనవాసాల్లోకి చొరబడుతున్నాయ్. రాజకీయ రొచ్చుబాట్లతో నాయకులు కొట్టుమిట్టులాటలతో కాలక్షేపం చేస్తుంటే, సృష్టికి మూలంలో ఉన్న భూమిని కాస్తా నీట ముంచినట్టు మన భూబకాసురులు ముంచేస్తున్నారు. మరో ఆదివరాహనారాయణుడు పుట్టి మనల్ని ఆదుకోవాలి. లేనిచో మరికొంత తీరప్రాంతం సముద్ర మునకకు గురయ్యే ప్రమాదం ఉన్నది. ●

# సంక్రాంతి పర్వత్రయానికి ముందే ప్రపంచ తెలుగు మహాసభల పర్వత్రయం తెలుగువారికి ఆనందం కూరుస్తున్నది!



నందనలో 2012 డిసెంబర్ ప్రపంచ ప్రళయం అన్నారు. ఐశ్వర్యప్రదాతలైన త్రిలింగేశ్వరులు రాష్ట్రాన్ని రక్షిస్తూండగా, ఆ ప్రళయాన్ని ముగురమ్మల మూలపుటమ్మ తెలుగుతల్లి తరిమివేసి, వేంకటేశ్వరుని రక్షణ కవచంగా ఉన్న తిరుపతిలో సంక్రాంతికి ముందే తెలుగు సభల క్రాంతి నాందీ వాక్యం పలికింది.

నందనా నీవు అటుండవమ్మా, అంటూ ఋతు నిర్దేశితంగా జనవరిలో వరిసి చెరుకు వన్నెలతో సంక్రాంతిని జరుపుకుంటున్నాం. కాలం చేసే వక్ర ప్రమా(దా)ణాలను ఋషుల ఋతునిర్దేశం నిర్దేశించినట్టుగానే జరగడం తథ్యమని భూతకాలం అక్షణాలా జరిపిస్తూనే ఉన్నది. అది ఈ పుణ్యభూమిలోని అన్నపూర్ణా ప్రసాదిత భూమి చేసుకున్న సుకృతం. దండకారణ్యంలో పద్నాల్గువేల మంది రాక్షసుల్నీ ఒక్క రామబాణం తునిమిపారేసినట్టు త్రిలింగేశ్వరులూ వారిమధ్య వెలసిన శ్రీ వేంకటేశ్వరుడూ కాపాడుతూనే ఉంటాడు.

ఆంగ్ల సంవత్సరంలో వచ్చే ఈ తొలి పండుగ ఇంటికి వరిసిరి రావడం, వచ్చినవన్నీ మనమే తినకుండా, దానగుణమలవరచడం – మనసు శరీరాల్లో అట్టడుగుకు పోయిన ఆనందాన్ని వెలికితేవడానికీ భోగి, పెదపండుగ, కనుమ పండుగలు మనమును కమనీయముగ రమారమణీయానందానుభూతులొసగే పండుగలుగా పరవశింపచేయనున్నాయ్.

**నిత్యదానము చేత – నియమంబు కలుగు**
**నిత్యానదానము చేత – కష్టాలు తొలగు**
**నిత్యానదానము చేత – సత్యంబు దొరకు**
**నిత్యానదానము చేత – నిఖిలంబు లభించు**
**నిత్యదానము చేత – నిరయము నశించు**
**నిత్యదానము చేత – నెలతకూజూడ**
**నిత్యమగు వైకుంఠ సామ్రాజ్యమంబు**

– చిన్న పిల్లలకు సహితమూ అర్థమయ్యేట్టు, పిన్నతనము నుంచీ సత్యము, ధర్మము, దానగుణములలవడడానికి ఇలాంటి పద్యాలు చెప్పేవారు.

ఈ సంక్రాంతి పండుగకు, నెల ముందు నుంచీ పిల్లలకూ, స్త్రీలకూ, పెద్దలకు అనేక నిత్య కార్యక్రమములేర్పరచారు. నిజానికిది చలికాలమైనప్పటికినీ పిల్లలూ, స్త్రీలూ సూర్యోదయానికి ముందే లేవాలి. కొందరు కోడి కూతకు ముందే లేస్తారు. కాలకృత్యాలు తీర్చుకుని, వాకిట ముందు ముగ్గులు పెడతారు. ఆ ముగ్గుల్లో పిల్లలు ఆవుపేడతో జీడిమామిడికాయల్లాటి గొబ్బెమ్మలు పెట్టి, పైన బంతిపువ్వు పెట్టి గొబ్బిళ్ళ పాట పాడుతూ, గొబ్బెమ్మ చుట్టూ తిరుగుతూ, గొబ్బియల్లో గొబ్బియులనే పాట చప్పట్లు కొడుతూ పాడడం, ఆ గొబ్బెమ్మలను గోడలపై పిడకలు చేసి, మరునాటి ముగ్గుల్లో పెట్టే గొబ్బెమ్మలను, ఇలాగే పాటలను పాడిన తరువాత ఆ గొబ్బెమ్మలను గోడమీద పిడకలుగా చరిచి భోగి పండుగనాడు ఆ ఎండిన గొబ్బెమ్మలను ఓ దండగా గుచ్చి మంటల్లో వేస్తూ, భోగి మంట చుట్టూ తిరుగుతూ ఆనంద భోగం అనుభవించడం భోగి పండుగ ప్రత్యేకత.

**గొబ్బియల్లో గొబ్బియలో**
**గొబ్బితట్టు బాలికరెల్లరూ గుంపు గూడుడీ**
**గుండ్రముగా నీటుగాను గొబ్బి వేయుదాం!**
**గొబ్బీ సుబ్బమ్మా! నీవూ రావమ్మా**
**అడుగున అడుగేసి ఆటలాడమ్మా**
**నరసాపురం నుంచీ గొబ్బి నర్సమ్మ వచ్చె**
**సుబ్బి గొబ్బెమ్మా సుఖపడనిస్తావా?**
**తామరపువ్వంటి తమ్ముణ్ణిస్తావా?**
**చేమంతిపూవంటి చెల్లెల్నిస్తావా?**
**మల్లెపూవంటి మరిదినిస్తావా?**
**మంకెనపువ్వంటి మరదల్నిస్తావా?**
**మొగలిపువ్వంటీ మొగుణ్ణిస్తావా?**

– ఇలా ఆటపాటలతో ధనుర్మాసం నెల్లాళ్లూ ఆనందంగా గడిచిపోతుంది. భోగినాడు పిల్లలు తలంటి స్నానం చేసి, గుత్తులు గుత్తులుగా కట్టిన గొబ్బి దండలను భోగి మంటల్లో వేసి ఆనందం తబ్బిబ్బవ్వడంతో ఆరోజు ప్రారంభమవుతుంది. సాయంత్రం ఇంట్లోని చిన్న పిల్లను కూర్చోపెట్టి భోగిపళ్ళను పోస్తారు. నానవేసిన సెనగలు, రేగుపళ్ళు, చిల్లర నాణెములు భోగి పళ్ళెంలో వేస్తారు. పేరంటానికి వచ్చిన ముత్తైదువులు పాటలు పాడి భోగిపళ్ళు నెత్తిమీద పోసి ఆశీర్వదిస్తారు. రెండవ రోజు సంక్రాంతి. సంక్రాంతినే పెద్ద పండుగగా జరుపుకుంటారు. ఆరోజుననే సూర్య నారాయణమూర్తికి పొంగళ్ళు పెడతారు. తమిళనాడులో అయితే పొంగలో పొంగల్ అని పాటలు పాడుతూ పరవశం చెందడం ఈనాటికీ జరుగుతూన్నది.


**పాడి పంటలకు లోటులేని పల్లెసీమ మనదిరా**
**ముత్యాల ముగ్గుల్లో గొబ్బెమ్మలు పెట్టి**
**బంతి పూమాలలు ద్వారబంధానికి కట్టి**
**పాలిచ్చే పశువులకు పసుపూ కుంకము**
**పనిచేసే బసవడికి పత్రీ పుష్పం**
**గాదుల్లో ధాన్యం కావిళ్ళ భాగ్యం**
**కష్టించే కాపులకు కలకాలం సౌఖ్యం**
**బంగారు బొమ్మల కొలువు మాయింట్లో పేరంటం**
**రండమ్మా రండమ్మా రండి – కొత్త**
**అల్లుడొచ్చేను చూడగరండి – సంక్రాంతి**
**పండుగే పండుగ – సంబరాల సంక్రాంతి**
**సంబరాలే సంబరాలు సౌందర్యపు సంబరాలు**

– అంటూ పంటలు యింటికి వచ్చి, కొత్త అల్లుడు అమ్మడు కొంగట్టుకు తిరుగుతుంటే హాయమ్మ హాయి నాలుగు రోజుల హాయీ భోగి, మకర సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అని నాలుగు రోజులే కాదు, నెల్లాళ్ళు పండుగే! సూర్యనారాయణమూర్తికి పొంగలి పెట్టడం, ఇంటి ముంగిట గంగిరెద్దుల వాళ్ళు, హరిలోరంగ హరి అనే హరిదాసులు, పగటి వేషగాళ్ళు పాలెగాళ్ళతో ఇల్లు పరవశమవుతుంటే – ఇంటి అరుగుల చూరుకు కట్టిన వరికంకెలకు పిచ్చుకలు వస్తాయ్. బావ మరదళ్ళతో పరిహాసాలు భలే జోరుగుంటాయ్. అందుకే కవులు పొంగి పొంగి వచ్చింది, సంబరాల సంక్రాంతి – సంపదలు పెంపు చేయు సంక్రాంతి అన్నారు. ఈ సంక్రాంతికైనా ఆంధ్రదేశం పోగొట్టుకున్న కాంతులన్నీ పునరుద్ధరించుకుంటూ పుడమిని పులకరింపచేస్తుందని ఆశిద్దాం. ●

# సెల్యూలాయిడ్‌పై తొలి నేపధ్యగానం ఎం.ఎస్. రామారావు నుండే నాంది పలికింది

## తెలుగు చిత్ర సీమలో తొలి నేపధ్య గాయకుడు ఎం.ఎస్. రామారావు

### అనన్తరమ్ 'సుందరకాండ' పారాయణకర్తగా పేర్గాంచి, ప్రసిద్ధి పొందాడు!



తొలిరోజుల్లో పాటలు పాడగల నటీనటులు నటించేవారు. అపుడు నేపధ్యంలో పాడేవారూ లేరు. నేపధ్య యంత్రాలూలేవు. కాలక్రమంలో పాటలు పద్యాల్కు గాకుండా నటనకు పరిమితయిన నటీనటులు రావడం ప్రారంభమైనది.



తొలి నేపధ్యగాయకునిగా ఎం.ఎస్.రామారావు పేరు వెండితెరకెక్కింది. ఇది అనూహ్యంగా ఏ అర్ధరాత్రో స్వాతంత్రోద్యమం సిద్ధించిన విధంగా లభించిన అదృష్టం కాదు. రామారావుగారికి సంగీతమంటే ప్రాణం. ఆయన శ్వాస తీసుకుంటూన్నట్లుగానే అలవోకగా పాడుతూండే వారు. గుంటూరులోని హిందూ కళాశాలలో చదువుకుంటు న్నప్పుడూ అంతర్ కళాశాల లలిత సంగీత పోటీలు వచ్చాయ్. అందులో ఎం.ఎస్.రామారావు గారు మొదటి బహుమతిని గెలుచుకున్నారు. ఆ సభకు న్యాయమూర్తిగా విచ్చేసిన అడవి బాపిరాజుగారు రామారావు పాటకు సమ్మో హితుడై, వ్యక్తిగతంగా అభినందిస్తూ, నీవు నీ గానలాపమును సినిమాల్లో ప్రవేశించి, రాణించే ప్రయత్నం చెయ్యమని సలహాయిచ్చారు. ఆ రోజుల్లో హిందీ గాయకుడు సైగల్ పాటలు ప్రాచుర్యంలో ఉండడంతో ఎం.ఎస్.రామారావు ఆ పాటలనే పాడేవారు. అందరూ ఆయన్ను సైగల్‌లానే పాడుతున్నావయ్యా- అనే సరికి ఉబ్బితబ్బిబ్బయి బొంబాయి వెళ్ళి సుప్రసిద్ధ దర్శక నిర్మాత శాంతారామ్‌ను కలిసి పాటపాడివినిపించారు. శాంతారామ్ రామారావు పాటను ఆసాంతమూ విని- పాట బాగుంది; నీవు హిందీ బాగా నేర్చుకుని రావాలి' అన్నారు.

శాంతారామ్ మాటతో ఆయన రిప్లై కార్డులా మద్రాసు చేరుకున్నారు. మద్రాసులో సుప్రసిద్ధ సినిమాకవి, ఎందరి ఉనికికో కారణమైన సముద్రాల రాఘవాచార్యను కలుసుకోగా ఆయన వ్రాసిన రెండు పాటల ఆల్బమ్‌ను రామారావుచే పాడించారు. ఆ పాటలకు సి.ఆర్. సుబ్బరామన్ స్వరకర్త. అటు తరువాత సముద్రాలవారి సలహాతోనే వాహినీ వారి 'దేవత' చిత్రంలో 'ఈ వసంతం నిత్యముకాదు, పూవు దొన్నెలో తీయదనం లేదు' అనే పాటలు సముద్రాలగారు వ్రాయగా చిత్తూరు వి.నాగయ్య స్వరకల్పనం చేసారు. అదేఁవి చిత్రమోగానీ ఎం.ఎస్.రామారావు తన గాన ప్రభావంతో రెండు దశాబ్దాలు శ్రోతలను అలరించి, ఉత్తర జీవితాన్ని ఆధ్యాత్మిక రంగానికి అంకితం చేసారు. **శ్రీ హనుమాన్ దేవులు నాయెద పలికిన సీతారామకథా, నేపలికిన సీతారామ కథా** అంటూ సుందరాకాండ పారాయణ కచ్చేరీలతో ఆబాలగోపాలములోనూ, రామ, సీత, లక్ష్మణ హనుమస్మరణతో 'రామరసాసుధ'ను నింపి వేసారు. సుందరాకాండ పారాయణ కారణంగా 'సుందరదాసు' పేరుతో భక్తలోకం ఆయన్ను హృదయాలకు హత్తుకున్నది.

రామారావు నేపధ్యగాయక జీవితంలో ప్రత్యేకమైన విశిష్టత ఉన్నది.

ఆ స్వరం ఆయనదే! మరొకరికి అలవడ లేదు. ఆ రోజుల్లో సుప్రసిద్ధనాయక పాత్రధారి సి.హెచ్. నారాయణరావుకు రామారావు గొంతు సరిపోయింది. (ఉదాహరణంగా చెప్పుకోవాలంటే రాజకపూర్‌కు ముఖేష్ గొంతు సరిపోయి నట్టుండేది) ఆయన నారాయణరావు పాటలకు మాత్రమే పరిమితం కాలేదు.

ఎం.ఎస్.రామారావును ప్రోత్సహించిన వారిలో నటుడు నిర్మాత దర్శకుడైన కె.ఎస్. ప్రకాశరావు (దర్శకేంద్రుడు రాఘవేంద్రుడి తండ్రి). ఆయన నిర్మించిన ద్రోహి చిత్రంలో 'ప్రేమే కదా' అనే పాట 'దీక్ష' చిత్రంలో ఆత్రేయ రచన, పెండ్యాల స్వరకల్పనలో 'పోరాబాబూ-పో పోయి చూడు ఈ లోకం పోకడ' అనే పాట తెలుగు, తమిళ శ్రోతలచే 'సూపర్‌హిట్టు' గా అభినందించబడింది. వై.వి.రావు తీసిన 'మానవతి' చిత్రంలో గాయని బాలసరస్వతితో కలిసి పాడిన 'ఓ మలయ పవనమా? పాట, 'గృహప్రవేశం'లో 'హలాహలమే పాట మంచి పేరు తీసుకుని రావడమే గాకుండా వై.వి.రావు తీసిన 'రామదాసు' హిందీ చిత్రంలో, కన్నడంలో నాగార్జున 'పాండురంగమహత్యం'లో **దారికానని బాటసారి,** అగ్నిపరీక్షలో **సత్యస్వరూపుడే దేవుడఁమ్మా** అనే పాట ఇలా ఎన్నో చిత్రాల్లో 'హిట్' లైన పాటలుపాడారు.

సి.హెచ్. నారాయణరావు నాయకపాత్ర ధరిస్తే ఎం.ఎస్.రామారావు పాడి తీరవలసినదే! వారిద్దరికీ అన్ని చిత్రాల్లోనూ జోడీ కుదిరింది. ఎం.ఎస్.రామారావు 'పల్లె పడుచు' చిత్రానికి సంగీతదర్శకత్వం వహిస్తూ పాటలు పాడారు. రామారావుగారి నేపధ్యగాన జీవితంలో చెప్ప వలసిన విశేషమున్నది. గాయకునిగా తెరపై కనిపించిన చిత్రం 'తాసిల్దార్'. ఈ చిత్రంలో వై.వి.రావుగారు **'ఈరేయి నన్నొల్లనేరవారాజా'** అనే నండూరి సుబ్బారావుగారి 'ఎంకి' పాట ఉన్నది. ఆ పాట రచయిత నండూరి సుబ్బారావుగారు ఎలా పాడతారో వెళ్ళి తెలుసుకురమ్మని ఏలూరు పంపించారు. రామారావు ప్రత్యేకంగా ఏలూరు వెళ్ళి, వారి బాణీని విని, కొన్ని చమక్‌లు చేసి పాడారు. ఆ పాట సర్వజనామోదం పొందింది.


కొన్ని కారణాల కారణంగా ఆయన కొలంబియా వారికి కొన్ని పాటలు, భక్తి గీతాలు రికార్డులుగా యిచ్చారు. ఆయన సినిమా రంగం నుంచి వైదొలగి రాజమండ్రి వెళ్ళిన తరువాత, నిర్మాత ఆర్.వి.రమణమూర్తి ఆయన్ను రప్పించి ఓ.పి.నయ్యర్ దర్శకత్వంలో పాడించారు. ఆయన దేశభక్తి గీతాల్లో **ఓ మహాత్మా, నను బాసిపోతివా, పండిత జవహర్‌లాల్ ఇదే మా జోహార్,** హంపీ శిల్పాలమీద, తాజ్‌మహల్ మీద పాడిన మంచి మంచి గీతాలు జనం నోళ్ళలో ఎంతగానో ఊరాయ్. ఎన్నో మంచి గీతాలు పాడినప్పటికినీ ఆయన దృష్టి రామభక్తి వైపు తిరిగింది. మద్రాసు నుంచీ మకాము రాజమండ్రీకి మార్చారు. రామాయణంలోని బాలకాండను అయోధ్యకాండ, సుందరకాండ కచ్చేరీలు చేస్తూ సుందరదాసుగా మారిపోయారు. యుద్ధకాండ గేయరచన చేస్తూ 1992సం॥ ఏప్రిల్ 20న గుండెపోటువచ్చి ఆంజనేయునిలో ఐక్యమయ్యారు. కానీ సుందరాకాండపారాయణ కచ్చేరీ ఆగిపోకూడదని వారి మనుమడు (కూతురుని కుమారుడు) పి.శ్రీనివాస్ తాతగారి సుందరాకాండ పారాయణం కొనసాగిస్తున్నారు. ●

**గుంటూరు జిల్లా మోపల్లెలో నిత్యం ఇంట్లో భక్తి కార్యక్రమాలు భజనలు చేసే మోపర్తి రంగయ్య మంగమ్మ దంపతులకు జన్మించిన మోపర్రు సీతారామారావే ఎం.ఎస్.రామారావు.**

**రాయలు వంటివారు అడుగిడి, చంద్రగిరి రాజుల రాజ భోగములంది, అనేకమంది పెద్దల ఆవాసమూ, ఏడుకొండల వాని పాదసేవ చేస్తూ, నిత్యమూ పునీతమవుతూన్న చిత్తూరు (చిత్తములూరు) మండలములో నాలుగవ**

# ప్రపంచ తెలుగు మహాసభలు ప్రభుత్వ ఆధ్వర్యాన జరగడం శుభమ్ భవతు!

**2012** సం॥ల యుగాంతాన్ని 'తుస్సు'మనిపించిన ఏడుకొండల తేడు పాదసేవ చిత్తములూరు – అను పేరు మార్పు చెందిన చిత్తూరు జిల్లా ఏడాది క్రిందట



వేణుగోపాల స్వామివారి ఆలయం, పురాతన విరూపాక్షాలయం, ఇటీవల స్థాపించిన ద్రవిడ భాషా విద్యాలయం, బంగారు నిక్షేపాలు గల పుణ్యభూమి. ఎన్నో ఎన్నో! చూడగల కన్ను లుంటే ప్రపంచ సభలకు వచ్చే ప్రతినిధులు చూడదగ్గవెన్నో! ఆంధ్రా ఊటీ అనదగిన ప్రకృతి రమణీయ కొండలుగల పర్యాటక క్షేత్రం మదనపల్లి. ఇక్కడకు రవీంద్ర కవీంద్రుడు విచ్చేసాడు. జ్ఞానయోగి జిడ్డు కృష్ణమూర్తి ఉండేవారు.

ప్రస్తుత ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఈ జిల్లావాడే! జన్మభూమి ఋణం, మాతృ భాషామూర్తులందర్నీ ఇక్కడ చేర్చి, ప్రపంచ తెలుగు మహాసభలు ఇక్కడే జరిపాలనే కాంక్షతో, తిరుపతి వేంకటేశ్వరుని పాదాల చెంత జరిపించబూనడం తెలుగు పునర్వైభవం చెందుతుందనే విశ్వసిద్దాం.

కాబినేట్ మంత్రులు, అంకిత భావుకులైన అధికారులు సభల దిగ్విజయం

# చిత్తములూరు వయసు నూరు ఒకటి

నూరు వసంతాలను మహోన్నతంగా జరిపించుకున్న పుణ్యభూమి. విశ్వవిభుడు వేంకటేశ్వరుణ్ణి తలకెత్తుకున్న భూమి. గోవింద రాజులు శ్రీరంగధామునిలా సేవ లందించుకుంటున్న క్షేత్రరాజము, సాక్షాత్తూ శంకరుడైన కపిలేశ్వరుడు సహితం శేషాచలుడు పారించిన జలపాతముల నీరునే బట్టి అభిషేకములు జరిపించుకొంటున్న నిత్యాభిషేక భూమి. ఓ ప్రక్క కోదండరాముడు, మరోప్రక్కన గంగమ్మ అమ్మవారు, చంద్రగిరి దిశలో కల్యాణ వేంకటేశ విభుడు, రేణిగుంటకు ఓ గుంట ఇవతలగా తిరుచానూరులో వేంకటరమణుని అనుంగు సతీమణి అలిమేలు మంగమ్మ తల్లి వెలిసిన వైకుంఠనాధ పవిత్ర ప్రదేశం. దేవగంధర్వులు పరమానంద భక్తితాంత రంగులైన పాదధూళితో పవిత్రీకరణమైన ఆ క్షేత్రభూమి ఉండడంవల్లనే చిత్తములూరు జిల్లా అంతా దేవాలయములమయమైంది. శ్రీకృష్ణదేవరాయల క్షేత్ర పర్యటనా ప్రదేశమై, రాళ్లన్నీ రత్నాలుగా మారిపోయాయి. జాతిపిత గాంధీ చిత్తూరు, పుత్తూరు, శ్రీ కాళహస్తి, మదనపల్లి, పుంగనూరుల్లో ప్రజా ఉద్యమ విరాళాల కోసం రెండు పర్యాయములు పర్యటించారు. ఆయనకొక ఆదిమూర్తియనే వ్యక్తి వెండి పొన్ను చేతికర్రను బహూకరించారు. స్త్రీలు మెడలో పసుపుతాడులు కట్టుకుని, మంగళ సూత్రాలు విరాళంగా యిచ్చారు.

చిత్తూరు జిల్లాలో ఎన్నో విశిష్ట స్వయంభువుగా వెలసిన దేవతా మూర్తుల ఆలయాలున్న దివ్యక్షేత్రములున్నాయ్. శ్రీకాళహస్తి, కాణిపాకం, అరగొండ, నారాయణవనం, నాగలాపురం, కైలాసనాధ కోన వంటి దివ్య క్షేత్రాలు దగ్గర దగ్గరలోనే ఉన్నాయ్. తిరుపతిలో గంగమ్మ తిరునాళ్ళు ద్రౌపది తిరునాళ్ళు మహ భారత ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ప్రపంచంలో సుసంపన్నమైన శ్రీ వేంకటేశ్వరాలయం, నిత్యమూ లక్షమంది భక్తులు, కోట్లాది రూపాయల ముడుపులూ యిచ్చే ఆలయంగా, కలియుగ వైకుంఠంగా, పేరొందిన ఆలయం ఇక్కడే ఉన్నది. మద్రాసు నగర ఉనికికి స్థలదానం చేసిన చంద్రగిరి రాజులు కొండ దిగువ ప్రాంతం లోనే ఉన్నారు. దానధర్మాలకూ, నిత్యాన్న సంతర్పణలకూ తిరుపతి నిలయమైన ప్రదేశం.

ఇవిగాక రాజసం ఉట్టిపడే కోటలు, ప్రజలను ఆనందాబ్ధిలో ముంచే జలపాతాలు, వెయ్యేండ్ల చరిత్రగల కుప్పం పట్టణం, శ్రీ రాజా కంచినాయని జవ్వాజీ వారు పాలించిన పట్టణం, వీరికోసం ఏర్పాటు చేసుకున్న మహల్, కోట దుర్గం,



కోసం మండలం రోజులుగా కృషి చేస్తున్నారు. దేశ విదేశాల్నుంచీ ఐదు వేల మందికి పైగా ప్రతినిధులు వస్తున్నట్టు రిజిస్టర్ చేసారు. అమెరికా, మలేషియాల నుంచీ అనేకమంది ప్రతినిధులు ముందుగానే వచ్చారు.



నన్నెంతో అభిమానంగా చూసే మలేషియా తెలుగు వారు కుటుంబాలతో నన్ను చూచి, అభినందించి వెళ్ళారు. తిరుపతి గోడలన్నీ సుందరమైన చిత్రాలతో తెలుగుదనంతో నింపివేసారని వింటున్నాం. ఈ మహాక్షేత్ర నగరంలో కల హోటళ్ళు, లాడ్జిల్లోని గదులన్నిటినీ సభలకు వచ్చే ప్రతినిధుల కోసం ముందుగా ప్రజత్వం రిజర్వు చేసినట్టు వింటున్నాం. వచ్చే ప్రతినిధులకు ఏ అసౌకర్యమూ కలుగకుండా అధికారులు అహరహం కృషి చేస్తున్నా మంటున్నారు. తినబోతూ రుచులడగడం దేనికి? ప్రభుత్వమే 37 సంవత్సరాల నన్తరం ప్రపంచ తెలుగు మహాసభలకు నడుము కట్టడం సంతోషం. ప్రపంచంలోని తెలుగు వారందర్నీ సమీకరించడం, అందునా విశ్వవిభుని పాద సన్నిధిలో జరగడం విశేషం. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డినీ ఆయన అమాత్యులనూ, అధికారులనూ ముందుగానే అభినందిద్దాం. ●



